సాక్షి బాపట్ల

ఆదివారం । 27 । ఆగస్టు । 2023




కుంకుమబండ్లతో గ్రామోత్సవం

పాలువాయి(రెంటచింతల): పాలువాయి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి కొలుపులలో భాగంగా శనివారం గ్రామస్తులు వైభవంగా కుంకుమ బండ్లతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



కార్తికేయుని సేవలో..

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి సుజాత కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

29న గవర్నర్ రాక

ఏఎన్‌యూ : రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 29వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి రానున్నారు. గవర్నర్ పర్యటనను రాజ్‌భవన్ అధికారికంగా ఖరారు చేసింది. 29న ఉదయం 11 గంటలకు గవర్నర్ ఏఎన్‌యూకి చేరుకుంటారు. యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు ఏఎన్‌యూ నుంచి బయలుదేరి 1.20 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు శనివారం తెలిపారు. పోటీలను సోమవారం మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 8వ తేదీ నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 86399 22978 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కొల్లిపరలో 11.2 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 11.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 1.2 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... ప్రత్తిపాడు 5, కాకుమాను 4, మంగళగిరి 3.2, దుగ్గిరాల 2.8, చేబ్రోలు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

1న సామూహిక వరలక్ష్మీ వ్రతం

అమరావతి: పవిత్ర శ్రావణమాసంలో మూడవ శుక్రవారం స్థానిక అమరేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథ్ శర్మ శనివారం తెలిపారు. ఆలయ రెండవ ప్రాకారంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారిని అలంకరించి వందలాది మంది ముత్తయిదువులతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపచేస్తామన్నారు. పాల్గొనే భక్తులు ఆలయ కార్యాలయంలో ముందుగా తెలియచేయాలన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకల్లా దేవాలయానికి రావాల్సి ఉంటుందన్నారు.

రేపటి నుంచి పీఈటీల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నరసరావుపేటఈస్ట్: పాఠశాల విద్యా కమిషనరేట్ ఆదేశాల మేరకు ప్రతి నెలా 28వ తేదీన పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయులకే పరిమితమైన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేయాలని పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సమావేశాలకు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జెడ్పీ హైస్కూల్, శంకరభారతీపురం(నరసరావుపేట), జెడ్పీ హైస్కూల్, సుగాలీకాలనీ, సత్తెనపల్లి, జెడ్పీ హైస్కూల్ (ఎస్ఎస్) చిలకలూరిపేట, జెడ్పీ హైస్కూల్, పెదకూరపాడు, జెడ్పీ హైస్కూల్ (బాలికలు) వినుకొండ, జెడ్పీ హైస్కూల్ (బాలురు)మాచర్ల, జెడ్పీ హైస్కూల్, పిడుగురాళ్ల పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్టు వివరించారు.

అయ్యవార్లకు అవార్డుల పండగ

- దరఖాస్తుల ఆహ్వానం
- ప్రభుత్వ ఉత్తర్వులు
- మార్గదర్శకాలు విడుదల

బాపట్లఅర్బన్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023కు దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులు. మండల, డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు పెంచారు. జిల్లాస్థాయి అవార్డులకు 25 నుంచి 28వ తేదీ వరకు, రాష్ట్రస్థాయి అవార్డుకు 29 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉంది. దరఖాస్తులను ఆయా స్థాయిలోని కమిటీలు పరిశీలిస్తాయి.

వివిధ స్థాయిల్లో కమిటీలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈఓ చైర్మన్‌గా కమిటీ ఉంటుంది. మండలానికి చెందిన మరో హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. ఎంఈఓ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారి పనితీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాల్సి ఉంటుంది.

- డివిజన్ స్థాయిలో చైర్మన్‌గా మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా డైట్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త కలెక్టర్ ఎంపిక చేసిన జిల్లా స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఎంపిక చేస్తారు.
- అసంపూర్తిగా ఉన్న, ఫోటోలు లేని, ఆలస్యంగా వచ్చి దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకోరు.

తొమ్మిది కేటగిరిల్లో

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తొమ్మిది కేటగిరిల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హైస్కూల్లో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ప్రైమరీ, యూపీ స్కూల్లో ఎస్జీటీ, హైస్కూల్లో డ్రాయింగ్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్ టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవీ మార్గదర్శకాలు

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు కనీసం 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి.
- ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, ఎంఈవోలు, ఇతర తనిఖీ అధికారులు అర్హులు కారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎటువంటి క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు లేని వారు మాత్రం అర్హులు.
- గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తులను ఎంఈఓకి సమర్పించాలి.
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదన చేసే ఉపాధ్యాయులకు సంబంధించి పది లైనులకు మించకుండా పరిశీలనాధికారి రాయాల్సి ఉంటుంది.



పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు(ఫైల్)

పారదర్శకంగా ఎంపిక



జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలన అనంతరం పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తాం. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుదారులలో అన్ని విభాగాలలోను ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తాం.

–పి.వి.జె.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

ఓటర్ల తొలగింపు దరఖాస్తులను విచారించాలి



బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

అద్దంకి రూరల్: ఓటర్ల జాబితాలో తొలగింపుల దరఖాస్తులను పక్కాగా పునఃపరిశీలించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటర్ల జాబితా సర్వేపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. అద్దంకి మండలంలో గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు తొలగించిన ఓట్లు, వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ఫామ్–7 పక్కాగా పరిశీలన చేయాలన్నారు. మృతులు, శాశ్వతంగా వలసలు వెళ్లిన వారి దరఖాస్తులు విచారణ నివేదిక ఆధారంగా పరిశీలించాలన్నారు. 87 మంది బీఎల్‌ఓలతో సమీక్షించారు. తదుపరి సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఉమాదేవి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, అద్దంకి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: ఓట్ల తొలగింపు ప్రక్రియపై వచ్చిన దరఖాస్తులను పునఃవిచారణ చేయాలని జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా ఆదేశించారు. చినగంజాం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు. ఇటీవల జరిగిన ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి బీఎల్‌ఓలు విధులు నిర్వహించాలని సూచించారు. మండలంలోని 262, 269, 273, 274, 279, 282, 294 పోలింగ్ కేంద్రాలకు వచ్చిన దరఖాస్తులు ఆయన స్వయంగా విచారించారు. తొలగింపుల కోసం చట్టబద్ధంగా దరఖాస్తుదారులకు నోటీసులు ఇవ్వాలని, బీఎల్‌ఓల పనితీరుపై ఎన్నికల అధికారుల పర్యవేక్షణ పెరగాలన్నారు. అత్యంత పారదర్శకంగా విధులు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలనలో సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చీరాల ఇన్‌చార్జ్ ఆర్డీవో జీ రవీందర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీవీ నారాయణ, చినగంజాం తహసీల్దార్ పీ పార్వతి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- వంకాయలపాడులో రూ.21.51 కోట్లతో గురుకుల పాఠశాల నిర్మాణం
- ప్రారంభించిన మంత్రులు విడదల రజిని, మేరుగ

యడ్లపాడు: పేద, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా వంకాయలపాడులో రూ.21.15 కోట్ల సాంఘిక సంక్షేమశాఖ నిధులు, మనబడి నాడు–నేడు నిధులు రూ.36లక్షలతో 8.5ఎకరాల్లో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల వసతి భవనాన్ని మంత్రి రజిని, పాఠశాల భవనాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. సభలో తొలుత మంత్రి రజిని మాట్లాడుతూ పేదల పిల్లలు పనులు వదిలి బడిబాట పట్టేలా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తెచ్చినది జగనన్న ప్రభుత్వం అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాజాపేటలో గురుకుల పాఠశాల మొదటి కాగా, తాజాగా ప్రారంభించిన వంకాయలపాడు పాఠశాల రెండోదన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్ని నాడు–నేడు కింద చేర్చి అన్ని వసతుల్ని కల్పిస్తున్నామన్నారు. వైద్య రంగంలో కూడా క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, ప్రతినెలా రెండు సార్లు దర్శించడం, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు అన్నింటా పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారన్నారు. నాడు –నేడుకు రూ.16వేల కోట్లు, సెప్టెంబర్ నుంచి ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నామన్నారు. సుమారు రూ.500 కోట్ల ఖర్చుతో మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సీఎం వీటన్నింటిని ఎవరి కోసం చేస్తున్నారో ఆలోచన చేయాలన్నారు. పేదల పిల్లలు లాయర్లు, ఇంజినీర్లు, ఇతర రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో విద్యను ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యతోనే పేదల తలరాతను మార్చాలనే బలమైన నమ్మకంతోనే ఆ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ పాఠశాల నిర్మాణం కోసం మన ప్రభుత్వం ఏకంగా రూ.21.15 కోట్లు, నాడు –నేడు ద్వారా రూ.36 లక్షల నిధులు ఖర్చు చేసి 8.5 ఎకరాల్లో 500 మంది విద్యార్థులకు సరిపడా వసతి కల్పించినట్లు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ఎంతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 1.57 లక్షల మందికి అమ్మ ఒడి ద్వారా రూ.250 కోట్లు, నాడు–నేడు తొలిదశలో రూ.150కోట్లు, రెండో దశలో రూ.350 కోట్లు ఖర్చు పెట్టనున్నామని తెలిపారు. రూ.22 కోట్లతో ఇంతటి సౌకర్యాల్ని కల్పించడం జరిగిందని, ఈ సదుపాయాల్ని సద్వినియోగం చేసుకుని పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సాంఘిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ సాయినాగార్జున యాదవ్ విద్య విలువల్ని, దానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. కార్యక్రమంలో గురుకుల స్కూల్ డీసీవో కె పద్మజ, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు టి రాజేంద్రప్రసాద్, ఎం వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జెడ్పీటీసీ ముక్తా వాసు, ఎంపీపీ పి రూనీస్, వైస్ ఎంపీపీ నాజులా, సర్పంచ్ వి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు బి బొల్లయ్య, పార్టీ నాయకులు విడదల గోపీ, గంటా శంకర్, సొసైటీ చైర్మన్ బి.శివరామకృష్ణ, గురుకుల పాఠశాల ఎస్ఎం కమిటీ చైర్మన్ బి శ్రీను, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, ప్రిన్సిపాల్ టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



గురుకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున

ఏపీ విద్యా పథకాలు దేశానికి ఆదర్శం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

ఏపీలో అమలు చేస్తున్న విద్యా పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మూడు నెలల కాలంలోనే పల్నాడు జిల్లాలో ప్రారంభించిన రెండో పాఠశాల వంకాయలపాడు గురుకులం అన్నారు. విద్యా రంగంలో గత ప్రభుత్వ పాలనకు..ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరుకు ఏపీ గురుకుల పాఠశాలలు చూస్తే తెలిసిపోతుందన్నారు. అసమానతలు పోయేలా నాడు–నేడుతో కోట్ల రూపాయలు విద్యారంగానికి వెచ్చిస్తూ పైసా ఖర్చు లేకుండా సకల సదుపాయాలతో ఉచిత విద్యాబుద్ధుల్ని కల్పించిన మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా, ఆయన రచించిన రాజ్యాంగాన్ని మార్గదర్శకంగా తీసుకుని పారదర్శక పాలన సాగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. బాబు హయాంలో పేదరికం 11.50 శాతం ఉంటే, జగనన్న ప్రభుత్వంలో 6శాతానికి తగ్గిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నిస్వార్థ రాజకీయ నాయకుడికి రాష్ట్ర ప్రజలందరూ అండగా ఉండాలన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

రేపు జగనన్న విద్యా దీవెన కార్యక్రమం

బాపట్ల : జగనన్న విద్యా దీవెన కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందనహాలులో జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొన్నంటారని తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల సంక్షిప్త సవరణ

జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న లక్ష్మీ శివజ్యోతి

కర్లపాలెం: ఓటర్ల సంక్షిప్త సవరణ కార్యక్రమం మండలంలో పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. ఓటర్ల సంక్షిప్త సవరణ కార్యక్రమంపై శనివారం జిల్లా రెవెన్యూ అధికారి తహసీల్దార్ కేశవనారాయణ రావుతో సమీక్షించారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, అలాగే మృతిచెందిన వారిని గుర్తించి తొలగించటం జరుగుతుందని, నిజమైన ఓట్లను తొలగించకుండా, బోగస్ ఓట్లు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే.. శిక్ష యజమానికే

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: మైనర్ బాలురకు వాహనాలిస్తే... వారు ఏదైనా ప్రమాదాలు చేసినప్పుడు శిక్ష వాహన యజమానికే పడుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో మళ్లీ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకొని ఇసుకతో నింపి రేడియం స్టిక్కర్లు అతికించిన డ్రమ్ములకు ఏర్పాటు చేశామన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీస పరిపక్వత వయస్సు లేని మైనర్ల చేతికి కొందరు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తున్నారన్నారు. మైనర్లకు రోడ్డు భద్రత నియమాలపై సరైన అవగాహన లేకపోవడంతో వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకొనవలసి వస్తుందన్నారు. ఒకవేళ మైనర్ నడుపుతున్న వాహనం ఏదైనా ప్రమాదానికి గురై ఎదుటి వ్యక్తికి అపాయం జరిగితే వాహన యజమాని కూడా ముద్దాయి అవుతారని తెలిపారు. పిల్లలను ఎంతో ప్రేమతో ఆప్యాయంగా పెంచుకున్న తల్లి దండ్రులు, పిల్లలు కోరిన వెంటనే వారి మీద ప్రేమతో వాహనాలు ఇస్తున్నారన్నారు. పిల్లలను ఎన్నో ఆశలతో అల్లారు ముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులు ఇటువంటి ఘటనల వలన జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు.



రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఐదు సవర్ల బంగారం, ఐదు కిలోల వెండి అపహరణ

మేదరమెట్ల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలో నుంచి బంగారం, వెండి వస్తువులను దోచుకుపోయారు దుండగులు. ఈఘటన శనివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. కొరిశపాడు మండలంలోని దైవాల రావూరు గ్రామానికి చెందిన పాతూరి లక్ష్మీ ఈనెల 21వ తేదీ ఇంటికి తాళం వేసి అద్దంకిలోని ఆమె కుమార్తె ఇంటికి వెళ్లింది. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తిరిగి ఇంటికి వచ్చి తాళాలు తీసేందుకు ప్రయత్నించగా అప్పటికే తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వెంటనే కొరిశపాడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై చౌదరి ఘటనా స్థలానికి చేరుకొని ఇంట్లో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు దొంగలు దోచుకుపోయినట్లు పోయిన వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



వస్తువులను పరిశీలిస్తున్న ఎస్సై జీవీ చౌదరి

ఉరేసుకొని నేపాల్ యువకుడు ఆత్మహత్య



సుశాంగ్ (ఫైల్)

చీరాల: ఉరి వేసుకుని నేపాల్ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చీరాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన సుశాంగ్ (20) చీరాలలోని ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. అతడి అన్న కుటుంబంతో సహా నేపాల్‌కు చెందిన మరికొంతమందితో కలిసి చీరాలలోని పాపరాజుతోటలోని ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. రోజు మాదిరిగానే పనికి వెళ్లి వచ్చాడు. అయితే ఏమైందో తెలియదు.. తెల్లవారే సరికి ఇంటి సమీపంలోని చెట్టుకు వేళ్లాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

టీటీడీ నిధులు రూ.25 లక్షలతో పనులు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: సనాతన హిందూ ధర్మాచారాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ఆచరిస్తూ, కాపాడుతున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. ఓల్డ్‌టౌన్ రహదారి విస్తరణలో భాగంగా కొంతభాగం కోల్పోయిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి మంజూరైన రూ.25 లక్షలతో చేయనున్న పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో అనేక దేవాలయాలను నిరాదరణకు గురిచేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం అభివృద్ధికి టీటీడీ ప్రతినిధులతో చర్చించి రూ.25 లక్షలు మంజూరు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మోపిదేవికి ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి

- చీరాల విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
- కోర్టు భవన సముదాయాలు, రికార్డుల పరిశీలన



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

చీరాల రూరల్: కక్షిదారులకు న్యాయవాదులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సముచిత న్యాయసాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. భారతి పేర్కొన్నారు. శనివారం ఆమె చీరాలకు వచ్చి కోర్టు భవన సముదాయాలను, కోర్టుల్లోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని న్యాయమూర్తి ఆకాంక్షించారు. ముందుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం న్యాయవాదులు స్థానిక సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు భవన సముదాయాలకు సంబంధించి మరమ్మతు పనులకు ఆదేశించామని చెప్పారు. కోర్టుల్లోని సిబ్బంది కొరతను కూడా త్వరలోనే తీరుస్తామని చెప్పారు. ఐఏఎల్ రాష్ట్ర ప్రతినిధి బూదరాజు శశికిరణ్ అందించిన సీపీసీ పుస్తకాలను న్యాయమూర్తి చేతులు మీదుగా 20 మంది జూనియర్ న్యాయవాదులకు అందించారు. న్యాయవాదులు న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌రాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ-మహిళ మృతి

- నలుగురికి గాయాలు
- పెళ్లి వేడుకకు వెళ్తుండగా ప్రమాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

మేదరమెట్ల: ఓ పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రమైన కొరిశపాడు జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు ఏసీ నగర్ రామమందిరం సమీపంలో నివాసం ఉంటున్న కొంతమంది కలిసి కారులో చిలకలూరిపేటలో పెళ్లి వేడుకకు వెళ్తున్నా రు. అదే సమయంలో చెన్నై నుంచి జార్ఖండ్‌కు వెళ్తున్న లారీ కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపానికి రాగానే డ్రైవర్‌కు మూత్ర విసర్జనకు లారీని ఒక్కసారిగా ఎడమ పక్కకు తిప్పాడు. దీంతో కారు లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మల్లీశ్వరీ శ్రీనివాసులు (40) అక్కడికక్కడే దుర్మరణం చెందగా డ్రైవర్ ఆనందకుమార్, సుధా, మహేష్, కిరణ్‌లకు రక్తగాయాలు అయ్యాయి. కాగా క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి తరలించారు. ప్రమాద స్థలాన్ని అద్దంకి రూరల్ సీఐ ఉమేష్, మేదరమెట్ల ఎస్సై నాగశివారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్యామ్ సుందర్‌కు పురస్కారం

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం గిడుగు రామమూర్తి సాహితీ పురస్కారాన్ని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ కు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించే తెలుగు భాష వికాస వారోత్సవాలలో ఈ పురస్కారాన్ని ఈ నెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఇవ్వనున్నట్లు అధికార భాష సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు ఒక లేఖ ద్వారా తెలియజేశారు.

అవగాహన అవసరం

వేటపాలెం: ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని డీపీఎం ఈరగాని వాణీశ్రీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో గల ఐసీడీఎస్ సమావేశం హాల్లో సమావేశం శనివారం నిర్వహించారు. గ్రామాల వారీగా ప్రకృతి వ్యవసాయంపై సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయ ద్వారా వచ్చే ప్రయోజనాలు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వారి పొలాల్లో సాగు చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, డీపీఎం ప్రేమరాజ్ పాల్గొన్నారు.